క్లుప్తంగా

కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం


రామాలయంలో సప్తాహంలో పాల్గొన్న భక్తులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో వేంచేసి ఉన్న కోదండ రామస్వామి దేవాలయం 31వ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా ఆలయంలో రామనామ సప్తాహం ప్రారంభించారు. కోదండ రామ భక్త సమాజం మర్రి అన్నపూర్ణమ్మ., నర్రా సుబ్బాయమ్మల ఆధ్వర్యంలో సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు బద్రినాథ్ స్వామికి విశేష అలంకరణలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంకీర్తన కార్యక్రమానికి ఇతర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీ సురేష్‌పై దాడి అమానుషం


చిరుమల సుధాకర్ మాదిగ

కారంచేడు: బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌పై యద్దనపూడిలో శుక్రవారం జరిగిన దాడి అమానుషమని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు చిరుమల సుధాకర్‌మాదిగ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఒక దళిత ఎంపీపైనే అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడటం చూస్తే వాళ్లు అధికారంలో ఉంటే దళితులకు రక్షణ ఎక్కడుంటుందన్నారు. ఒక ఎంపీపైనే ఇలాంటి అమానుషమైన రీతిలో ప్రవర్తించడంను ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆటోను ఢీకొన్న కారు


బొడ్డువానిపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో బోల్తా పడిన కారు

మేదరమెట్ల: ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు అదుపు తప్పి ఢీకొన్న ఘటన కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి కారులో ఓటు వేసేందుకు స్వగ్రామం వస్తున్నారు. కారు బొడ్డువానిపాలెం వద్దకు రాగానే ముందు ఉన్న ఆటో ఒక్కసారిగా బయలు దేరింది. దీంతో కారు డ్రైవర్ కారును అదుపు చేయలేకపోవడంతో కారు రోడ్డుపై పల్టీలు కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరిలో బీ.జ్యోతి అనే మహిళకు మాత్రమే స్వల్ప గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, పునర్వసు నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం


సుబ్బారావుకు నగదు అందజేస్తున్న ఆర్యవైశ్యులు

చినగంజాం: పేద కుటుంబానికి చెందిన మోటుమర్రి సుబ్బారావుకు గృహ నిర్మాణం కోసం వైఎస్సార్ సీపీకి చెందిన ఆర్యవైశ్యులు ఆర్థిక సాయమందించారు. ఆదివారం సుబ్బారావు ఇంటికి వెళ్లి రూ.10 వేలు నగదును స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గెల్లి వెంకట లక్ష్మీనారాయణ, అమరా శ్రీనిత‌వాసరావు, వలివేటి శ్రీనివాసరావు, పవన్ కుమార్ తదితరులు నగదును అందజేసిన వారిలో ఉన్నారు.

సమరానికి నేడే ఆరంభం


చీరాలలో ఎన్నికలకు సంబంధించిన హెల్ప్ డెస్క్ కేంద్రాలు


చీరాలలో ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన బస్సులు

- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తో పర్యవేక్షణ


చీరాలలో ఈవీఎంలను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది


వేటపాలెంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

చీరాల టౌన్/వేటపాలెం/చీరాల: సార్వత్రిక పోరు చివరి ఘట్టానికి చేరుకుంది. దాదాపు 60 రోజులు నుంచి జరుగుతున్న పోరుకు సోమవారం జరగనున్న ఎన్నికలతో ముగింపు పలకనుంది. సార్వత్రిక ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 202711 మంది ఉన్నారు. వీటిలో పురుషులు 98,729 మంది, స్త్రీలు 103958 మంది, థర్డ్ జెండర్ 24 మంది ఉన్నారు. ఎన్నికలకు నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాలతో పాటు, చీరాల మున్సిపాలిటీలో 218 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈఎన్నికలకు మొత్తం 467 మంది పోలింగ్ విధులు నిర్వహించేందుకు రేపల్లె, వేమూరు, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు చీరాల వచ్చారు. స్థానిక సెయింటాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాడ్స్, కంట్రోల్ యూనిట్లును పోలింగ్ బూత్‌ల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఈవీఎంలను, పోలింగ్ సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అందించారు. అలానే పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి ప్రత్యేకంగా 67 ప్రవేటు స్కూల్ బస్సులను, ఇతర వాహనాలను ఏర్పాటు చేశారు. 8 జోనల్ అఫీసర్లు, 22మంది రూట్ ఆఫీసర్లును నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో అసెంబ్లీకి 1, పార్లమెంట్‌కు 1 చొప్పున ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఆరుగురు చొప్పున సిబ్బంది, సెక్యూరిటీని కల్పించినట్లు ఆర్వో తెలిపారు. నియోజకవర్గంలోని 218 పోలింగ్ కేంద్రాల్లో 157 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా, వీడియో చిత్రీకరణ చేస్తున్నట్లు ఆర్వోతెలిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, వాహనాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు కె.నాసరయ్య, పి.కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, తదితరులు ఉన్నారు.

– వేటపాలెం మండల పరిధిలో మొత్తం 69 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమల్లో ఉంచారు. పోలింగ్ బూత్‌ల్లో దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓటర్లు క్యూలైన్లు ఏర్పాటు చేసి షామియానాలు ఏర్పాటు చేశారు.

అద్దంకి నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలు


మేదరమెట్లలో జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన షామియానాలు


సిద్ధం చేసిన పంగులూరు పోలింగ్ బూత్‌లు


బల్లికురవ: ముక్తేశ్వరం యూపీ స్కూల్‌లో పోలింగ్ ఏర్పాట్లు

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/జే.పంగులూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఎన్నిక జరగనుంది. మొత్తం ఐదు మండలాల్లో 298 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఐదురుగు అసిస్టెంట్ పోలింగ్ (ఏపీవో) అధికారులు, నలుగురు ఓపీవోల వంతున మొత్తం 1788 మంది అధికారులు ఎన్నికల విధులను నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు నమోదు చేసుకున్న కొత్త ఓటర్లతో కలుపుకుని మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,19,570 మంది పురుషఓటర్లు ఉండగా, 1,24,45 మంది స్త్రీ ఓటర్లు, 12 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

➤ బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయితీలో, 56 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి వసతులు కల్పించినట్లు ఎన్నికల అధికారి ఎం సుభద్ర చెప్పారు. 61వ పోలింగ్ బూత్ నుంచి 116వ బూత్ వరకు పీవో, ఏపీవో, ఓపిలోలకు సంబంధించి 300 మందిని రిజర్వులో మరో 40 మందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాతంతం ముగిసేందుకు రాజకీయపార్టీలు, ఓటర్లు సహకరించాలని బల్లికురవ ఎస్సై రవి శంకర్‌రెడ్డి కోరారు. సోమవారం జరిగే ఎన్నికలకు డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇరువురు సీఐలు, ఏఆర్ ఇన్స్‌స్పెక్టర్, ముగ్గురు ఎస్సైలు, ఎనిమిది మంది ఏఎస్సైలు, 40 మంది మెన్, 25 మంది స్పెషల్ సీఆర్పీలు కేటాయించారని చెప్పారు.

➤ జే.పంగులూరు మండలంలో 21 గ్రామాలకు సంబంధించి 49 బూత్‌లు ఉన్నాయి. 49 బూత్‌లకు గాను 39501 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషుల ఓట్లు 19210 కాగా స్త్రీల ఓట్లు 20291 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

➤ కొరిశపాడు మండలంలో పోలింగ్ నిర్వహణకు 44 బూత్‌లను ఏర్పాటు చేశామని, 352 మంది సిబ్బంది పోలింగ్ నిర్వహణలో పాల్గొంటున్నట్లు తహశీల్దార్ సుశీల తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి

చినగంజాం/కారంచేడు/మార్టూరు/యద్దనపూడి: నియోజకవర్గంలో పోలింగ్ నిర్వాహణకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ తెలిపారు. ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పర్చూరు బీఏఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత సెక్యూరిటీ నడుమ ఈవీఎంలు తరలించే బస్సులకు ఆధునిక జీపీఎస్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజక వర్గంలో 295 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు 3500 మంది సిబ్బంది, 600 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆరు మండలాల్లో ఓటు హక్కు వినియోగించుకునే 2,29, 333 మందిలో 1,11,865 మంది మహిళలు, 1,11,462 పురుషులు ఉన్నట్లు ఆయన వివరించారు.

☛ యద్దనపూడి మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 28 పోలింగ్ కేంద్రాలు ఉండగా 21525 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలీసు అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

☛ నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కారంచేడు ఏఈఆర్ఓ, తహశీల్దారు మోహర్‌కుమార్ తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 42 బూత్‌లను ఏర్పాటు చేసామన్నారు. 42 బూత్‌ల మోనిటరింగ్ కోసం ఐదుగురు సెక్టోరల్ ఆఫీసర్లను నియమించామన్నారు. పోలింగ్ సజావుగా జరిపించేలా సుమారు 250 మంది సిబ్బందిని నియమించారన్నారు. ఓటింగ్ కోసం వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు క్రమపద్ధతిలో రావడానికి కూడా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.


పర్చూరు: పోలింగ్ నిర్వాహణకు హాజరైన సిబ్బంది


పర్చూరు: పోలింగ్ కోసం సిద్ధం చేసిన ఈవీఎం యంత్రాలు


కారంచేడులో ఈవీఎం మిషన్లతో వస్తున్న ఎన్నికల సిబ్బంది


యద్దనపూడి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తా

- అరాచక శక్తుల ఆటకట్టిస్తా
- మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ, చీరాల అసెంబ్లీ అభ్యర్థి

చీరాల: తండ్రి వారసత్వ రాజకీయం నుంచి ఆయన పుణికి పుచ్చుకున్నారు. తండ్రి బాటలోనే చిన్నతనం నుంచి రాజకీయ ఓనమాలు నేర్చుకోవడం మొదలు పెట్టారు. మెల్ల మెల్లగా రాజకీయాన్ని అవపోశన చేసుకొని తనదైన శైలిలో ప్రజల్లో కలిసిమెలిసి ఒక్కడిగా కలిసిపోయారు. ఆయనే చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గానికి మరింత అభివృద్ధి చేస్తానంటున్న వెంకటేష్‌తో సాక్షి ముఖాముఖి..

టూరిజాన్ని మరో మెట్టుకు తీసుకెళ్తాం..

బడుగు, బలహీనవర్గాలు, వ్యాపారులు, చేనేతలు అధికంగా నివసించే చీరాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపుతాం, ప్రధానంగా ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్ది కొందరు స్వార్థపరులు తనకు వాటా ఇవ్వలేదని మెడికల్ కాలేజిని అడ్డుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుమతులు తీసుకువస్తాం. రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్‌లు, పట్టణ ప్రాంతంలో పార్కులు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు మరిన్ని చేస్తాం. ప్రధానంగా చీరాల తీర ప్రాంతంలో టూరిజాన్ని అభివృద్ధి చేసి మరో గోవాగా తీర్చి దిద్దుతాం. నేను పుట్టి, పెరిగింది చీరాలలోనే. నాకు సొంత ఇల్లు రామకృష్ణాపురం పంచాయతీలో ఉంది. స్థానికేతరులు అన్నవారికి తమ గురించి తెలుసుకోవాలి. తన తండ్రి ఇక్కడ నుంచే రాజకీయాలు చేశారు. మా నాయనమ్మ, తాతలు ఉన్నది చీరాలలోనే. నేను చీరాల బిడ్డనే.

అరాచక పాలనకు చరమగీతం పాడాం..

మా ప్రభుత్వం ఐదేళ్లలో కుటుంబానికి ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను అందించింది. నేతన్న నేస్తం ద్వారా చేనేతలకు రూ.24 వేలు, మత్స్యకార భరోసా కింద వేట నిషేదం సమయంలో రూ.10 వేలు చెల్లిస్తుంది. ఎన్నో పథకాలు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించింది. నాతండ్రి చీరాలలో గత ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటూ వందల కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైన్లు, పార్కులు వంటివి నిర్మించారు. పైపెచ్చు అరాచక పాలన నుంచి చీరాలను విడుదల చేశాం. కూటమి పార్టీ అభ్యర్థి తనకు అసలు పోటీనే కాదు. అతని ఓటమి ఎప్పుడో తేలిపోయింది.

చీరాలను ఎడ్యుకేషనల్ హబ్‌గా చేస్తాం..

నా తండ్రి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయనతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గడప గడపకు వెళ్లాను. నియోజకవర్గ స్వరూపం మొత్తం తెలుసుకున్నాను. వ్యాపార వర్గాలు ఏవిధంగా వేధింపులకు గురవుతున్నారో దగ్గరగా చూశాను. చేనేత వర్గాలు పడుతున్న ఇబ్బందులను చూశా వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేశా. చీరాలను ఎడ్యుకేషన్ హబ్‌కు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. మెడికల్ కళాశాల ఏర్పాటుతో చీరాల రూపురేఖలు మారుతాయి.

అక్రమాలకు తావులేదు..

మా హయాంలో ఇసుకను సులభతరం చేసి అందరికి అందేలా చేశాం. రేషన్ అక్రమ రవాణాపై కేసులు పెట్టించాం. గత పాలకులు రోజుకు వందల సంఖ్యలో ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి కోట్లు దండుకున్నారు. రేషన్ మాఫియాను దగ్గరుండి నడిపారు. గ్రానైట్ వ్యాపారుల దగ్గర అ ట్యాక్స్ పేరుతో కోట్లు దండుకున్న చరిత్ర వారిది. దళితులు భూములు దోచుకున్న ఘనత కూడా వారికే దక్కింది. వాన్‌పిక్ పేరుతో రైతును మోసగించి సీబీఐ విచారణలు కూడా జరిపించుకున్న చరిత్ర వారికే దక్కింది. మాపై ఆరోపణలు, అక్రమాలకు తావులేకుండా పరిపాలన సాగించాం.

150 మంది పోలీసుతో ప్రత్యేక నిఘా


స్వర్ణ వద్ద పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

కారంచేడు: నేడు మండలంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కారంచేడు ఎస్ కే సురేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థను ఆయన పరిశీలించారు. 30 మంది ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లతో మూడు ప్రత్యేక బృందాలుగా తిరుగుతుంటారన్నారు. వీరు కాకుండా 80 మంది పోలీస్‌లు బూత్‌ల వద్ద పటిష్టమైన భద్రతలో ఉంటారన్నారు. మండలంలో మొత్తం 8 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించామన్నారు. వీటి వద్ద మరో 30 మంది సాయుధ పోలీసు దళాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఒక ఎస్‌ఐ పర్యవేక్షణలో మొత్తం సుమారు 150 మంది పోలీసులను ఏర్పాటు చేశామన్నారు.

ఈర్లగంగమ్మకు మొక్కులు


అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: వ్యవసాయపనులు, వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం వివిధ ప్రాంతాలు రాష్ట్రాలకు వలసలు వెళ్లిన మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు ఎన్నికల పండుగకు స్వగ్రామాలకు చేరటంతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. వైశాఖమాసం పంచమి ఆదివారం సందర్భంగా భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి, కొణిదెన, గంగపాలెం, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాల్లోని ప్రజలు ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి సన్నిధికి చేరారు. ఆలయం సమీపంలో ఎంతో విశిష్టత కలిగిన మర్రిచెట్టు వద్ద పొంగళ్లుపెట్టి అమ్మవారికి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజరి చల్ల గుండ్ల శ్రీనివాసరావు, కమిటి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండ ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 20 టీడీపీ కుటుంబాలు


యడం బాలాజీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీకి చెందిన 21 కుటుంబాలు టీడీపీని వీడి ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. చీరాల వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ సమక్షంలో వారు పార్టీలో చేరారు. రాజుబంగారుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ కుక్కల బురకాయల రెడ్డితో పాటు మరో 20 మంది టీడీపీ నాయకులకు అభ్యర్థి బాలాజీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి కుక్కల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవత్ రామానుజుల పుట్టినరోజు


పల్లకి సేవలో పాల్గొన్న మహిళా భక్తులు


రామానుజుల వారి మూల విరాట్

చినగంజాం: స్థానిక భూ సమేత భావన్నారాయణస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల వారి పుట్టినరోజు వేడుక కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అలహరి మోహన లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో భగవత్ రామానుజుల వారి జన్మదిన నక్షత్రం తీరు నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలివేటి రామానుజం శివనారాయణ, పిచ్చయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.